క్లుప్తంగా

పదవీ బాధ్యతల స్వీకరణ



పదవీ బాధ్యతలు చేపడుతున్న వెంకటశివకుమార్

యాచారం: నందివనపర్తి ఓంకారేశ్వరస్వామి దేవస్థానం అనువంశిక ధర్మకర్త, ఫౌండర్ ట్రస్టీ చైర్మన్‌గా పప్పు వెంకట శివకుమార్ కాశ్యపన్ గురువారం పదవీ బాధ్యతలు స్వీకరించారు. పప్పు కృష్ణామూర్తి మృతితో ఆయన కుమారుడు వెంకట శివకుమార్ కాశ్యపన్‌తో దేవాదాయ, ధర్మదాయ శాఖకు చెందిన అధికారులు ప్రణీత్, ప్రవీణ్‌కుమార్‌ల ఆధ్వర్యంలో దేవాలయ ఆవరణలో ప్రమాణ స్వీకారం చేయించారు. నందివనపర్తి ఓంకారేశ్వరుడికి నందివనపర్తి గ్రామంతో పాటు నక్కిర్కసింగారం, తాడిపర్తి, కుర్మిద్ద గ్రామంలో 1440 ఎకరాలకు పైగా వ్యవసాయ భూమి ఉంది. ఈ భూమిని ప్రస్తుతం ఆయా గ్రామాల్లోని రైతులు కౌలు చేసుకుంటున్నారు. కార్యక్రమంలో గ్రామ పెద్దలు యాదయ్య, ప్రేమలత, చంద్రశేఖర్‌గుప్తా, విజయకుమార్, పూజారులు నరసింహారావు, పవన్‌కుమార్ శర్మ తదితరులు పాల్గొన్నారు.

పార్టీ బలోపేతానికి కృషి చేయండి



కడ్తాల్: మాజీ మంత్రి సబితారెడ్డిని కలిసిన బొప్పిడి గోపాల్

కడ్తాల్: మాజీ మంత్రి, మహేశ్వరం ఎమ్మెల్యే సబితారెడ్డిని గురువారం హైదరాబాద్‌లోని ఆమె నివాసంలో జిల్లా ఎంపీటీసీల సంఘం ప్రధాన కార్యదర్శి బొప్పిడి గోపాల్ మర్యాద పూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యేకు పుష్పగుచ్ఛం అందజేసి, శాలువాతో సన్మానించారు. అనంతరం నియోజకవర్గంలోని రాజకీయ పరిస్థితిని ఆమె అడిగి తెలుసుకున్నట్లు గోపాల్ తెలిపారు. బీఆర్‌ఎస్ పార్టీ బలోపేతానికి కృషి చేయాలని, స్థానిక సంస్థల ఎన్నికల్లో అత్యధిక స్థానాల్లో విజయం సాధించేందుకు పని చేయాలన్నారు. అలాగే, పార్టీకి పూర్వ వైభవం తీసుకువచ్చేందుకు కార్యకర్తలు, నాయకులతో సమష్టిగా కార్యక్రమాలను నిర్వహించాలని సూచించినట్లు తెలిపారు. కార్యక్రమంలో బీఆర్‌ఎస్ సోషల్ మీడియా కన్వీనర్ సాయికుమార్ తదితరులు ఉన్నారు.

ఆర్థిక సహాయం

తలకొండపల్లి: మండల పరిధిలోని పడకల్‌కు చెందిన రవి అనారోగ్యానికి గురై హైదరాబాద్ నిమ్స్ హాస్పిటల్‌లో చికిత్స తీసుకుంటున్నాడు. శుక్రవారం విషయం తెలుసుకున్న మాజీ జెడ్పీటీసీ ఉప్పల వెంకటేశ్ వైద్యుల ఖర్చుల నిమిత్తం రూ. 5000 ఆర్థిక సహాయం అందజేశారు. అలాగే, మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు ప్రభాకర్‌రెడ్డి రూ.10,000, మాజీ ఎంపీటీసీ రమేష్ ఆధ్వర్యంలోని నాయకులు రూ. 5000 అందజేశారు.

బాధిత కుటుంబానికి పరామర్శ

ఆమనగల్లు: మాడ్గుల మండలం బ్రాహ్మణపల్లి గ్రామ మాజీ సర్పంచ్ లక్ష్మయ్య తల్లి పులికంటి మైసమ్మ గురువారం ఉదయం మృతి చెందింది. మృతురాలి కుటుంబాన్ని మాజీ జెడ్పీటీసీ సభ్యుడు ప్రభాకర్‌రెడ్డి, మండల కాంగ్రెస్‌పార్టీ అధ్యక్షుడు బట్టు కిషన్‌రెడ్డి, గీత కార్మిక సంఘం రాష్ట్ర నాయకులు జల్లా రమేశ్‌గౌడ్ తదితరులు పరామర్శించారు. ఈ సందర్భంగా మృతురాలి కుమారులు చంద్రయ్య, మొగులయ్య, లక్ష్మయ్యలను వారు పరామర్శించి తీవ్ర సంతాపం వ్యక్తం చేశారు. పరామర్శించిన వారిలో నాయకులు వెంకటయ్య యాదవ్, చంద్రయ్యగౌడ్, ఓంప్రకాశ్‌రెడ్డి, తిరుపతయ్య, అచ్చయ్యగౌడ్, వెంకటయ్యగౌడ్, వెంకటయ్య, రమేశ్‌గౌడ్ తదితరులు ఉన్నారు.

నిర్దేశిత దుకాణాల్లోనే బయోమెట్రిక్ వినియోగం

పౌర సరఫరాల శాఖ ఎన్‌ఫోర్స్‌మెంట్ డీటీ రఘునందన్



ఇబ్రహీంపట్నం: రేషన్ బయోమెట్రిక్ యంత్రాలను నిర్దేశిత దుకాణాల్లోనే ఉపయోగించాలి. ఇతర దుకాణాలల్లోకి వాటిని తరలిస్తే చట్టరీత్యా కఠిన చర్యలు తప్పవని పౌర సరఫరాల ఎన్‌ఫోర్స్‌మెంట్ డీటీ మాచన రఘునందన్ హెచ్చరించారు. గురువారం ఇబ్రహీంపట్నంలో రేషన్ దుకాణాన్ని తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. కొందరూ రేషన్ డీలర్లు బయోమెట్రిక్ యంత్రాలను ఇష్టారాజ్యంగా తరలించి అక్రమాలకు పాల్పడుతున్నట్లు తమ దృష్టికి వచ్చిందన్నారు. పల్లెల్లో, గ్రామాల్లో ఉన్న చౌక దుకాణాలకు చెందిన బయోమెట్రిక్ యంత్రాలను సీటికి తీసుకెళ్లి ఏదో ఒక దుకాణంలో పెట్టి దందా చేస్తున్నట్లు తెలుస్తుందన్నారు. ఇలాంటి పనులు నిబంధనలకు విరుద్ధమన్నారు.

అడుగడుగునా ఆక్రమణలే!

కబ్జాలకు గురవుతున్న పులందరి వాగు

- ఆదిబట్ల నుంచి శేరిగూడ వరకు అన్యాక్రాంతం
- చెరబడుతున్న రియల్టర్లు
- హద్దులు గుర్తించని ఇరిగేషన్
- పట్టించుకోని రెవెన్యూశాఖ



ఎంపీపటేల్‌గూడ సమీపంలో పులందరి వాగును కబ్జా చేసి వేసిన రోడ్డు

ఇబ్రహీంపట్నం రూరల్: సహజ వనరులపై రియల్టర్ల కన్నుపడింది. కాదేది కబ్జాలకు అనర్హం అన్నట్లు ఇష్టం వచ్చినట్లుగా కబ్జాలకు పాల్పడుతున్నారు. ఓ వైపు కబ్జాలకు పాల్పడుతుంటే తమకేమి పట్టనట్లుగా రెవెన్యూ, ఇరిగేషన్ అధికారులు కళ్లు మూసుకుంటున్నారు. ఎవరైన ఫిర్యాదు చేస్తే సర్వే చేయడం కొద్ది రోజుల్లోనే మరిచిపోవడం చేస్తున్నారు. అధికారుల ఉదాసీనత వల్ల వందల ఏళ్ల చరిత్ర కలిగిన వాగులు, కాలువలు అన్యాక్రాంతమవుతున్నాయి.

పులందరి వాగు కబ్జా..

రావిర్యాల నుంచి ఆదిబట్ల, ఎంపీపటేల్‌గూడ, బొంగ్లూర్, శేరిగూడ ప్రాంతాల మీదుగా ఇబ్రహీంపట్నం తట్టిఖానా వరకు వెళ్లి అక్కడి నుంచి అనాజ్‌పూర్ సమీపంలో ఉన్న ఇందిరాసాగర్ అక్కడి నుంచి మూసిలో కలిసే అతిపెద్ద వాగు పులందరి వాగు. కాలువ రావిర్యాల నుంచి ఇబ్రహీంపట్నం వరకు 20 కిలోమీటర్ల పొడవున సాగుతుంది. ఒక్కోచోట కనీసం 20 మీటర్ల నుంచి 35 మీటర్లకు పైగా వెడల్పుతో ఉంటుంది. ఈ పులందరి వాగుకు 500 సంవత్సరాల చరిత్ర ఉంది. రోజురోజుకు ఈ ప్రాంతంలో భూముల ధరలకు రెక్కలు రావడంతో అన్యాక్రాంతం అవుతుంది. ఆదిబట్ల, ఎంపీపటేల్‌గూడ, బొంగ్లూర్ , శేరిగూడ , మంగళ్‌పల్లి ప్రాంతాల్లో ఉన్నటువంటి గొలుసుకట్టు చెరువుల్లోకి నీరొచ్చే ప్రధాన కాలువ ఇదే. ఇరిగేషన్, రెవెన్యూ రికార్డుల్లో ఉన్నప్పటికీ, కాలువను కుదించి రియల్టర్లు మట్టి పోసి మాయం చేస్తున్నారు. వర్షాలు పడితే కాని కాలువ కనిపించదు అన్నట్లుగా తయారు చేశారు. కాలువ పక్కనే అడ్డగోలుగా నిర్మాణాలు చేపట్టారు. చాలా మంది ప్లాట్లుగా మార్చి విస్తీర్ణం తగ్గించారు .

అధికారుల పెడచెవిన

చెరువులు, కుంటలను కాపాడాలని అధికారులకు ఫిర్యాదులు చేసినా కనీసం పట్టించుకోవడం లేదని ఆరోపణలు వినిపిస్తున్నాయి. ఎవరైతే కబ్జాలకు పాల్పడుతున్నారో వారికి అనుకూలంగా వ్యవహరిస్తున్నారని విమర్శలు ఉన్నాయి. ఆదిబట్ల నుంచి శేరిగూడ వరకు అనేక చోట్ల కాలువను కబ్జా చేశారు. అంతా రెవెన్యూ, ఇరిగేషన్ అధికారుల కనుసన్నల్లోనే తతంగం నడుస్తోందని ప్రజలు చర్చించుకుంటున్నారు. అధికారుల తీరుమార్చుకొని అన్యాక్రాంతం అవుతున్న కాలువలను కాపాడాలని ఆయా గ్రామాల ప్రజల కోరుతున్నారు.

కబ్జా చేస్తున్నారు



రియల్టర్లు పులందరి వాగును పూర్తిగా కబ్జా చేస్తున్నారు. కాలువను కుదించి రోడ్లు వేసుకుంటున్నారు. నీటి ప్రవాహం రాకుండా అడ్డుకట్ట వేస్తున్నారు. పెద్ద ఎత్తున కాలువను అన్యాక్రాంతం చేసినా అధికారులు చూసీచూడనట్లుగా వ్యవహరిస్తున్నారు. స్పందించకుంటే జిల్లా కలెక్టర్‌కు ఫిర్యాదు చేస్తా. –గౌని బాల్‌రాజ్, ఎంపీపటేల్‌గూడ

చర్యలు తీసుకుంటున్నాం



పులందరి వాగుపై వచ్చిన ఫిర్యాదులపై స్పందించాం. గతంలో స్పెషల్ డ్రైవ్‌లు చేపట్టి, కాలువల్లో నిర్మాణాలు, మట్టిని తొలగించాం. నిరంతరం నిఘా పెట్టి కాలువను కాపాడుతాం. పైఅధికారుల దృష్టికి తీసుకెళ్లి చర్యలు తీసుకుంటాం. –రాజ్యలక్ష్మి, ఏఈ ఇరిగేషన్

నేడు పూరీ జగన్నాథ రథయాత్ర



ఆమనగల్లుకు చేరిన ఇస్కాన్ టెంపుల్ రథం

ఆమనగల్లు: ఆమనగల్లు పట్టణంలో ఈనెల 12న హైదరాబాద్ కూకట్‌పల్లిలోని ఇస్కాన్ టెంపుల్ ఆధ్వర్యంలో పూరీ జగన్నాథ రథయాత్ర నిర్వహిస్తున్నట్లు రథయాత్ర నిర్వాహకులు పాపిశెట్టి రాము, తల్లోజు వెంకటయ్య, వీరబొమ్మ రామ్మోహన్, ముక్కిరి కృష్ణయ్యలు తెలిపారు. గురువారం వారు విలేకరుల మాట్లాడుతూ.. ఆమనగల్లు, మాడ్గుల, తలకొండపల్లి, కడ్తాల మండలాల భక్తుల ఆధ్వర్యంలో పూరీ జగన్నాథ రథయాత్ర నిర్వహిస్తున్నట్లు తెలిపారు. స్థానిక పట్టణంలోని అయ్యప్పకొండ నుంచి రథయాత్ర ప్రారంభమవుతుందని, జాతీయ రహదారి గుండా మార్కండేయ దేవాలయం మీదుగా కన్యకాపరమేశ్వరీ దేవాలయం వరకు రథయాత్ర కొనసాగుతుందని వివరించారు. అనంతరం కన్యకా పరమేశ్వరీ దేవాలయంలో పూజలు, ప్రవచనాలు ఉంటాయని చెప్పారు. రథయాత్రలో ఇస్కాన్‌టెంపుల్ ప్రెసిడెంట్ మార్షింగ్ ప్రభు, ఆర్ట్ ఆఫ్ రిలాగ్గేషన్ ట్రస్ట్ చైర్మన్ విజయప్రతాప్ మహారాజ్ పాల్గొంటారని వారు చెప్పారు. రథయాత్రలో పెద్ద ఎత్తున ప్రజలు పాల్గొని విజయవంతం చేయాలని వారు కోరారు. ఇస్కాన్‌టెంపుల్ రథం గురువారం సాయంత్రం ఆమనగల్లుకు చేరుకుంది. స్థానిక మహిళలు రథానికి పూజలు చేసి స్వాగతం పలికారు.

ఎస్‌ఐ వెంకటేశ్‌కు సత్కారం



ఎస్‌ఐ వెంకటేశ్‌ను సత్కరిస్తున్న నాయకులు

ఆమనగల్లు: ఆమనగల్లు ఎస్‌ఐగా బాధ్యతలు స్వీకరించిన వెంకటేశ్‌ను గురువారం ఎస్‌ఐ వెంకటేశ్‌ను జిల్లా ఆర్యవైశ్య సంఘం ఆధ్వర్యంలో నాయకులు ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో ఆర్యవైశ్యసంఘం నాయకులు కండె సాయి, రాజేశ్, రమాకాంత్, సురేశ్, శ్రవన్, వినయ్, శ్రీకంఠం ఉన్నారు. అలా గే ఎస్‌ఐ వెంకటేశ్‌ను జిల్లా పట్టు రైతుల సంక్షేమ సంఘం అధ్యక్షుడు సక్రునాయక్, కోరింతకుంట తండా నాయకులు రవినాయక్, రమేశ్, బీమా, శంకర్, బాలు, మల్లేశ్ తదితరులు సత్కరించారు.

ప్రజారోగ్యంపై అప్రమత్తత



యాచారం: మాట్లాడుతున్న ఎంపీడీఓ



మంచాల: సమావేశంలో మాట్లాడుతున్న బాలశంకర్, తదితరులు

ఎంపీడీఓ నరేందర్‌రెడ్డి

యాచారం: ప్రజా ఆరోగ్యంపై అప్రమత్తంగా ఉండాలని ఎంపీడీఓ నరేందర్‌రెడ్డి పేర్కొన్నారు. మండల పరిషత్ కార్యాలయంలో గురువారం పంచాయతీ, వైద్య, ఐసీడీఎస్ సిబ్బందితో ఆయన సమావేశమయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. వర్షాల దృష్ట్యా తాగునీరు కలుషితం కాకుండా జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. గ్రామాల్లో ఉన్న పైపులైన్లు లీకేజీలు కాకుండా, ట్యాంకులు శుభ్రం చేయాలని తెలిపారు. ఇంటింటి సర్వే చేసి విషజ్వారాలు, వాంతులు, విరేచనాలు వంటి సమస్యలు ఉంటే వెంటనే వైద్య సిబ్బందికి సమాచారం అందించి, వైద్య శిబిరాలు నిర్వహించేందుకు కృషి చేయాలని సూచించారు. నిర్లక్ష్యం వహిస్తే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు.

జాగ్రత్తలు తీసుకోవాలి

మంచాల: గ్రామాల్లో అంటు వ్యాధులు ప్రబలకుండా జాగ్రత్తలు తీసుకోవాలని మంచాల ఎంపీడీఓ బాలశంకర్ అన్నారు. గురువారం నిర్వహించిన ప్రత్యేక సమావేశంలో ఆయన ముఖ్యఅతిథిగా పాల్గొని మాట్లాడారు. వర్షాకాలాన్ని దృష్టిలో ఉంచుకొని ప్రజలకు అంటు వ్యాధులు సోకకుండా తీసుకోవాల్సిన జాగ్రతలపై చైతన్యం చేయాలన్నారు. ఆశ వర్కర్లు, ఏఎన్‌ఎంలు గ్రామాల్లో తిరిగి వర్షాలకు ఇళ్ల మధ్య నీరు నిల్వకుండా జాగ్రత్తలు తీసుకోవాలని సూచించాలని తెలిపారు. నీటి నిల్వల కారణంగా ఈగలు, దోమలు విపరీతంగా తయ్యారయి ప్రజలు రోగాల బారిన పడే ప్రమాదం ఉందన్నారు. ప్రజలకు ముందస్తు జాగ్రతలపై అవగాహన కల్పించాలని సూచించారు. అలాగే ప్రతి గ్రామంలో 6 వేల మొక్కలు నాటేలా చర్యలు తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో ఆరుట్ల డాక్టర్ ప్రియంక, ఏపీఓ వీరాంజనేయులు, వివిధ గ్రామాల ప్రత్యేకాధికారులు, పంచాయతీ కార్యదర్శులు, ఏఎన్‌ఎంలు, ఆశవర్కర్లు పాల్గొన్నారు.

అక్రమ నిర్మాణంపై ఫిర్యాదు



టౌన్‌ప్లానింగ్ అధికారికి వినతిపత్రం అందజేస్తున్న కాలనీవాసులు

తుర్కయంజాల్ : పురపాలక సంఘం పరిధి రాగన్నగూడలోని సర్వే నంబర్ 279లో అనుమతులు లేకుండా కమర్షియల్ నిర్మాణం చేపట్టిన వారిపై చర్యలు తీసుకోవాలని సామ రెసిడెన్సీ వెల్ఫేర్ అసోసియేషన్ అధ్యక్షుడు పి.శివకుమార్ , కాలనీవాసులు గురువారం టౌన్ ప్లానింగ్ అధికారి శ్రీనివాసులుకు ఫిర్యాదు చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. సదరు భవన నిర్మాణదారుడు రోడ్డును ఆక్రమించి, ట్రాన్స్‌ఫార్మర్‌ను ఏర్పాటు చేస్తున్నారు. అధికారులు వెంటనే స్పందించి దానిని తొలగించడంతో పాటు, అక్రమ నిర్మాణంపైన చర్యలు తీసుకోవాలని వారు కోరారు. కార్యక్రమంలో మణిపాల్ రెడ్డి, ఆనంద్‌రెడ్డి, యాదయ్య, శ్రీను తదితరులు పాల్గొన్నారు.

అక్రమార్కులపై చర్యలు తీసుకోండి

ఆర్డీఓకు మహిళా రైతు ఫిర్యాదు



యాదమ్మ

ఇబ్రహీంపట్నం: మా పట్టా భూమిలోకి అక్రమంగా ప్రవేశించి పశువుల దొడ్డిని ధ్వంసం చేసిన వారిపై చర్యలు తీసుకోవాలని దండు మైలారం గ్రామానికి చెందిన మహిళా రైతు రాసుల యాదమ్మ గురువారం ఆర్డీఓ అనంత రెడ్డికి వినతిపత్రం అందజేశారు. కొన్నేళ్లుగా 174, 192 సర్వే నంబర్‌లో 4 ఎకరాల 24 గుంటల భూమిని సేద్యం చేసుకొని జీవిస్తున్నామని యాదమ్మ చెప్పారు. ఈ భూమిని జి జగదీశ్వర్ వద్ద కొనుగోలు చేశామని, సెల్‌డీడ్, మ్యూటేషన్ నాపేరుపై ఉందన్నారు. కొంత మంది దౌర్జన్యంగా తమ భూమిలోకి ప్రవేశించి పశువుల దొడ్డిని ధ్వంసం చేసి, రోడ్డు వేసేందుకు ప్రయత్నిస్తూ తమను బెదరిస్తున్నారని ఆమె వాపోయారు. స్థానిక పోలీస్‌స్టేషన్‌లో ఇటీవల ఈ విషయంపై ఫిర్యాదు చేసినట్లు చెప్పారు. ఆర్డీఓ, తహసీల్దార్ తమకు న్యాయం చేయాలని విన్నవించారు.

పెండింగ్ స్కాలర్‌షిప్‌లు విడుదల చేయాలి

కందుకూరు: పెండింగ్ స్కాలర్‌షిప్, ఫీజు రీయింబర్స్‌మెంట్‌ను వెంటనే విడుదల చేయాలని ఎస్ఎఫ్ఐ జిల్లా కమిటీ సభ్యుడు సిద్దూ పేర్కొన్నారు. ఈ నెల 22న ఎస్ఎఫ్ఐ ఆధ్వర్యంలో నిర్వహించనున్న చలో కలెక్టరేట్ కార్యక్రమానికి విద్యార్థులు భారీగా తరలిరావాలని కోరుతూ గురువారం కళాశాలల్లో కరపత్రాలు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఎస్ఎఫ్ఐ జిల్లా కమిటీ సభ్యుడు సిద్దూ మాట్లాడుతూ...నూతన ప్రభుత్వం ఏర్పడి 7నెలలు గడుస్తున్నా విద్యారంగ సమస్యలను పట్టించుకోవడంలేదన్నారు. ఇప్పటికీ విద్యాశాఖకు మంత్రిని నియమించలేదన్నారు. ఆరేళ్లుగా స్కాలర్‌షిప్‌లు, ఫీజురీయింబర్స్‌మెంట్ నిధులు పెండింగ్‌లో ఉన్నా పట్టించుకునే వారు కరువయ్యారన్నారు. విద్యారంగ సమస్యలు వెంటనే పరిష్కరించాలని డిమాండ్ చేశారు.ఎస్ఎఫ్ఐ నాయకులు వంశీ, ప్రభాకర్, కార్తీక్, బన్నీ, గణేష్, సంపత్ తదితరులు పాల్గొన్నారు.

‘దందా’ చేసే మిల్లులపై చర్యలు

మహేశ్వరం: రేషన్ దందా చేసే మిల్లులపై చర్యలు తప్పవని జిల్లా పౌరసరఫరాల శాఖ ఎన్‌ఫోర్స్‌మెంట్ డీటీ మాచన రఘునందన్ హెచ్చరించారు. గురువారం మండల కేంద్రంలోని పలు రైస్ మిల్లులను ఆయన ఆకస్మికంగా తనిఖీ నిర్వహించారు. మండలంలోని రైస్ మిల్లర్లు రేషన్ బియ్యాన్ని కొని, అక్రమంగా నిల్వ చేసి అధిక ధరలకు అమ్ముకుంటున్నారని తమ దృష్టికి వచ్చిందన్నారు. రైస్ మిల్లర్లు ఇలాగే రేషన్ దందా కొనసాగిస్తే పీడీయాక్ట్ నమోదు చేసి జైలుకు పంపడమే కాక, కఠిన చర్యలు తీసుకుంటామని ఆయన హెచ్చరించారు.

న్యాయవాదుల నిరసన



నిరసన వ్యక్తం చేస్తున్న న్యాయవాదులు

ఆమనగల్లు: సిద్దిపేట జిల్లా న్యాయవాది రవికుమార్‌పై పోలీసులు వ్యవహరించిన తీరును ఖండిస్తూ ఆమనగల్లు పట్టణంలో బార్ అసోసియేషన్ ఆధ్వర్యంలో న్యాయవాదులు కోర్టు విధులను బహిష్కరించి నిరసన వ్యక్తం చేశారు. రవికుమార్‌కు ఆమనగల్లు బార్ అసోసియేషన్ సభ్యులు సంఘీభావం ప్రకటించారు. పోలీసులపై చర్యలు తీసుకునే వరకు ఉద్యమిస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో ఆమనగల్లు బార్ అసోసియేషన్ అధ్యక్షుడు జగన్, ప్రధాన కార్యదర్శి ఆంజనేయులుయాదవ్, సంయుక్త కార్యదర్శి రామకృష్ణ, లైబ్రేరియన్ శేఖర్, సీనియర్ న్యాయవాది యాదీలాల్, న్యాయవాదులు మల్లేశ్, సంతోష్, జగన్, గణేశ్, శ్రీనివాస్, బిక్య, సర్దార్ పాల్గొన్నారు.

అక్షయపాత్రకు అప్పగించొద్దు



ధర్నా చేస్తున్న మధ్యాహ్న భోజన కార్మికులు

అబ్దుల్లాపూర్‌మెట్ : మధ్యాహ్న భోజన పథకాన్ని స్వచ్ఛంద సంస్థ అక్షయపాత్రకు అప్పగించ వద్దంటూ మండలంలోని ఎంఈఓ కార్యాలయం ఎదుట సీఐటీయూ ఆధ్వర్యంలో మహిళలు గురువారం ధర్నా చేపట్టారు. ఈ సందర్భంగా మధ్యాహ్న భోజనం వంట చేసే మహిళలు మాట్లాడుతూ.. మధ్యాహ్న భోజన పథకం మొదలయినప్పటి నుంచి గ్రామాల్లోని డ్వాకా గ్రూపుల మహిళలు ఆయా గ్రామాల్లోని పాఠశాలల్లో ఎలాంటి జీతభత్యాలు లేకుండా సేవాదృక్పథంతో పాఠశాల పిల్లలకు వంట చేసి పెడుతున్నారు. 23 ఏళ్లుగా నష్టాలను భరిస్తూ వంట చేసి పెడుతున్న కార్మికులను పక్కన పెట్టి.. ప్రభుత్వం మా పొట్ట కొట్టి స్వచ్ఛంద సంస్థ అయిన అక్షయపాత్రకు అప్పగించాలని కుట్ర చేస్తోందని ఆరోపించారు. ప్రభుత్వ నిర్ణయాన్ని తక్షణమే విరమించుకోవాలని లేని పక్షంలో సీఐటీయూ ఆధ్వర్యంలో పెద్ద ఎత్తున ఆందోళన చేస్తామని హెచ్చరించారు. సీఐటీయూ మండల కన్వీనర్ నర్సింహా ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో, మంజుల లక్ష్మమ్మ, రమాదేవి, పుష్ప, అలివేలలు పాల్గొన్నారు.

అందుబాటులో పశుగ్రాస విత్తనాలు



పంపిణీకి సిద్ధంగా ఉన్న పశుగ్రాస విత్తనాలు

కడ్తాల్: మండల కేంద్రంలోని పశువైద్యకేంద్రంలో ఎస్సీ, ఎస్టీ రైతులకు పశుగ్రాస విత్తనాలు (చొప్ప జొన్నలు) సీహెచ్ఎస్ 24, ఎంఎఫ్ రకం సబ్సిడీ విత్తనాలు అందుబాటులో ఉన్నాయని మండల పశువైద్యాధికారి భానునాయక్ గురువారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. 1000 కేజీల విత్తనాలు ఎస్సీ రైతులకు, 2000 కేజీ విత్తనాలు ఎస్టీ రైతులకు రాయితీపై అందించేందుకు సిద్ధంగా ఉన్నాయని తెలిపారు. ప్రతి రైతుకు 5 కేజీల నుంచి 10 కేజీల అందించనున్నట్లు చెప్పారు. సంబంధిత రైతులు ఆధార్ కార్డు, కుల ధ్రువీకరణ పత్రం జిరాక్స్ పత్రాలతో సంప్రదించాలని సూచించారు. ఎస్సీ, ఎస్టీ రైతులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

కుట్టు మిషన్ల పంపిణీ



కుట్టు మిషన్లు పంపిణీ చేసిన నిత్యరెడ్డి తదితరులు

మంచాల: మండల పరిధిలోని దాద్‌పల్లి గ్రామంలో దుర్గాబాయి మహిళా శిశు సంక్షేమ వికాస కేంద్రం ఆధ్వర్యంలో మహిళలకు ఉచితంగా కుట్టుమిషన్ శిక్షణ ఇచ్చి, మిషన్లు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హాజరైన మాజీ జెడ్పీటీసీ నిత్యరెడ్డి మాట్లాడుతూ.. ప్రతి మహిళ స్వయం ఉపాధి అవకాశాలను మెరుగు పరుచుకోవాలన్నారు. అనంతరం 12 మందికి ఉచితంగా కుట్టుమిషన్లు పంపిణీ చేశారు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయుడు యాదగిరి, అంగన్‌వాడీ టీచర్ పద్మ పాల్గొన్నారు.

అవగాహన ర్యాలీ



ర్యాలీని నిర్వహిస్తున్న వైద్య సిబ్బంది

మాడ్గుల: ప్రపంచ జనాభా దినోత్సవం సందర్భంగా గురువారం ప్రాథమిక ఆరోగ్య కేంద్రం డాక్టర్ మోహన్ ఆధ్వర్యంలో మండల కేంద్రంలో అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా డాక్టర్ మోహన్ మాట్లాడుతూ.. తల్లీ బిడ్డ శ్రేయస్సు కోసం సరి అయిన సమయంలో గర్భధారణ, బిడ్డకు మధ్య అంతరం ఉండాలన్నారు. భారతదేశానికి కొత్త గుర్తింపు టెంప్రరీ మేథడ్స్ పాటించాలని తెలిపారు. కండోమ్, అంతర ఇంజక్షన్స్ మధ్యంతర ఐయూసీడీ గర్భనిరోధక మాత్రలు, ప్రసవానంతర ఐయూసీడీ అత్యవసర గర్భ నిరోధక మాత్రలు (మాలా-ఎన్) ద్వారా బిడ్డకు ఎడమ కాకుండా పాటించవచ్చని పేర్కొన్నారు. కార్యక్రమంలో ఆశవర్కర్లు, ఎఎన్‌ఎంలు, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.



ఫిక్స్‌డ్ డిపాజిట్ పత్రం అందజేస్తున్న పూర్వ విద్యార్థులు

పూర్వ విద్యార్థుల సమ్మేళనం

ఇబ్రహీంపట్నం: శేరిగూడ జెడ్పీహెచ్ఎస్‌లో 2001–2002 బ్యాచ్ పదో తరగతి చదివిన పూర్వ విద్యార్థులు గురువారం ఓ రిసార్ట్‌లో కలిశారు. సుమారు 22 సంవత్సరాల అనంతరం కలిసిన విద్యార్థులు ఒకరినొకరి యోగక్షేమాలు అడిగి తెలుసుకున్నారు. పాత జ్ఞాపకాలను గుర్తుచేసుకొని ఆనందంగా గడిపారు. అనంతరం గురువులను సత్కారించారు. చింతపల్లిగూడ గ్రామానికి చెందిన స్నేహితుడు జోగు కిరణ్ అనారోగ్యంతో మరణించాడు. దీంతో అతని కుమార్తె పేరుపై రూ. 53 వేలు ఫిక్స్‌డ్ డిపాజిట్ చేసి కుటుంబ సభ్యులకు ఆ పత్రాన్ని అందజేశారు. కార్యక్రమంలో పూర్వ విద్యార్థులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

అభివృద్ధి పనులు వేగవంతం చేస్తాం

జోనల్ కమిషనర్ హేమంత్‌పాటిల్



మ్యాన్‌హోల్‌ను పరిశీలిస్తున్న మంత్‌పాటిల్

హుడాకాంప్లెక్స్: సరూర్‌నగర్ డివిజన్ పరిధిలోని జింకలబావి కాలనీ, విజయపురి కాలనీల్లో ఎల్‌బీనగర్ ఈస్ట్ జోన్ కమిషనర్ హేమంత్ పాటిల్‌తో పాటు సర్కిల్ డిప్యూటీ కమిషనర్ సుజాత, శానిటరీ డిపార్ట్‌మెంట్ డీఈ నీలిమ, స్థానిక కార్పొరేటర్ ఆకుల శ్రీవాణిలు గురువారం పర్యటించారు. జేబీ కాలనీలో వర్షపునీటి నాలా, విజయపురి కాలనీలో మురుగునీటి నాలా, పోచమ్మబాగ్ ప్రభుత్వ పాఠశాల వద్ద రోడ్డు, భగత్‌సింగ్‌నగర్ జీడీ పాయింట్ పరిస్థితిని పరిశీలించారు. ఈ సందర్భంగా కార్పొరేటర్ మాట్లాడుతూ.. శానిటేషన్ పనులు అధ్వానంగా ఉన్నాయని, వర్షాకాలాన్ని దృష్టిలో ఉంచుకుని మ్యాన్‌హోల్ మూతలు ఏర్పాటు చేయాలని జోనల్ కమిషనర్‌ను కోరారు. కాలనీవాసులకు సత్వరమే ప్రత్యామ్నాయ పరిష్కారాన్ని అందించడానికి క్షేత్ర పర్యటన చేశామని ఆమె తెలిపారు.

సాక్షి
మీరు వివాహ, జన్మదిన, పదవీ విరమణ శుభాకాంక్షలు, శ్రద్ధాంజలి, వర్ధంతి, జయంతి, వ్యాపార, ఉద్యోగ ప్రకటనలు, నోటీసులు, బహిరంగ ప్రకటనలు మొదలగు అన్ని రకాల ప్రకటనలు సాక్షి దినపత్రిక కొరకు సంప్రదించండి.
బి. కిరణ్‌కుమార్
9912220386